# ఇంద్రియాల సద్వినియోగంవల్లనే దైవానుగ్రహ ప్రాప్తి

సదయం హృదయం యస్య భాషితం సత్య భూషితం
కాయం పరహితే యస్య కలితస్య కరోతికిం ?

ఎవరి హృదయం దయతో నిండియుండునో, ఎవరి వాక్కు సత్యముతో కూడియుండునో, ఎవరి కాయము పరోపకార సంబంధమైన కార్యములందు పాల్గొనునో అట్టి మానవుని జీవితం ధన్యమైనది. అట్టివానిని కలిప్రభావం ఏమాత్రమూ కదిలించలేదు.

ప్రపంచంలోని సమస్త జీవరాసులు నాల్గు వర్గములుగా విభజింప బడినవి. 1. అండజములు (గ్రుడ్డునుండి పుట్టినవి) 2. పిండజములు (గర్భమునుండి ఆవిర్భవించినవి) 3. స్వేదజములు (చెమటనుండి పుట్టినవి) 4. ఉద్భిజములు (భూమినుండి ఉద్భవించినవి). ఒక్కొక్క వర్గము క్రింద 21 లక్షల చొప్పున మొత్తం 84 లక్షల జీవరాసులున్నాయి. ఇవన్నీ మూడు రకములైన బాధలకు గురియౌతున్నాయి. 1. అధిభౌతికము 2. అధిదైవికము 3. ఆధ్యాత్మికము. జంతువులవలన, ఈగలు, దోమలు వంటి క్రిమికీటకాదులవలన సంభవించే బాధలు అధిభౌతికమునకు సంబంధించినవి. భూకంపములు, జలప్రళయములు వంటి ప్రకృతివైపరీత్యములవలన, కలరా, ప్లేగు వంటి జాడ్యములవలన కలిగే బాధలు అధిదైవికమునకు సంబంధించినవి. ఆహారవిహారముల చేతను, దుర్మార్గులచేతను సంభవించే బాధలు ఆధ్యాత్మికమునకు సంబంధించినవి. అయితే ఈ సర్వబాధలకు నివారణ ఏమిటి? ఆత్మవిశ్వాసాన్ని దృఢంగా కల్గియుండటమే. ఆత్మను విశ్వసించాలి. ఆత్మను గౌరవించాలి. ఆత్మానందము నిమిత్తమై పాటుపడాలి. ఆత్మానందాన్ని పొందటానికి నవవిధమార్గములు చెప్పబడినాయి –

"శ్రవణం, కీర్తనం, విష్ణోః స్మరణం, పాదసేవనం,
వందనం, అర్చనం, దాస్యం, స్నేహ మాత్మనివేదనం"

sri sathyasai vachanamrutam

ఈ నవవిధమార్గములద్వారా మానవుడు తనకు సంభవించే వ్యాధులను, బాధలను నివారణ గావించుకోవచ్చు.

**మానవుడు అనుసరించవలసిన ధర్మం**

మహాభారత యుద్ధానికి వెళ్ళే ముందు దుర్యోధన, దుశ్శాసనులు తమ తల్లియైన గాంధారికి పాదనమస్కారం చేశారు. నిర్మల హృదయం, నిశ్చల చిత్తం, నిస్వార్థ ప్రేమ కలిగిన గాంధారి ఏమని దీవించింది? "యతో ధర్మ స్తతో జయః" ధర్మమున్నచోట జయము కల్గుగాక! అన్నది. అక్కడినుండి వారు తమ గురువైన ద్రోణాచార్యునివద్దకు వెళ్ళి నమస్కరించగా, ఆయన "యత్ర ధర్మః తత్ర కృష్ణః యత్ర కృష్ణః తత్ర జయః" ధర్మమెక్కడో కృష్ణుడక్కడ, కృష్ణుడెక్కడో విజయమక్కడ అన్నాడు.

మీరు మానవులుగా జన్మించారు. కాని, మానవధర్మాన్ని అనుసరిస్తున్నారా? మీరు మానవధర్మాన్ని అనుసరించినప్పుడు ఆ ధర్మమే మిమ్మల్ని రక్షిస్తుంది. మీరు మీ స్వస్థానమును మరచిపోవటంచేతనే అనేక బాధలకు గురి అవుతున్నారు. చేప స్వస్థానం నీరు. నీటియందున్నప్పుడే దానికి ఆనందం. నీటిని వదలి అది క్షణమైనా జీవించలేదు. అట్లే, మీ స్వస్థానం ఆత్మ. కనుకనే కృష్ణుడు "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" అన్నాడు. మీరు ఆత్మ నుండి ఉద్భవించినవారు. కనుక, మీరు నిరంతరం ఆత్మచింతన చేయాలి. ఆత్మను ఆధారంగా చేసుకొని జీవించాలి. ఇదే మానవుడు అనుసరించివలసిన ధర్మం. ఆత్మను మరచిపోవటంచేతనే మీరు అధర్మంలో ప్రవేశించి, అనేక బాధలకు గురి అవుతున్నారు.

**ఏ పని చేసినా దృష్టి ఆత్మపై ఉండాలి**

మీవద్ద ధనకనకవస్తువాహనాదులెన్నైనా ఉండవచ్చును; మీరు ఎంతటి గొప్ప పదవినైనా చేపట్టవచ్చును. కాని, అవేవీ మిమ్మల్ని రక్షించలేవు. ఒక్క ఆత్మవిశ్వాసమే మీకు రక్ష. తల్లి తన బిడ్డను ఇంట్లో పడుకోబెట్టి నీళ్ళు తీసుకురావటానికి నదికి వెళుతుంది. నీళ్ళ బిందెను తన తలపై పెట్టుకొని తోటి స్త్రీలతో అనేక విషయాలు మాట్లాడుతూ నడుస్తున్నప్పటికీ ఆమె మనసంతా తన బిడ్డపైనే ఉంటుంది. "బిడ్డ నిద్ర లేచి ఏడుస్తోందో ఏమో" అన్న ఆదుర్దాతో త్వరత్వరగా ఇంటికి చేరుకోవటానికి ప్రయత్నిస్తుంది. అదేరీతిగా మీరీ జగత్తులో ఏ పని చేసినప్పటికీ మీ

srisathyasaivachanamrutam

దృష్టిని మాత్రం ఆత్మపై పెట్టుకోవాలి. ఆత్మయే మీ లక్ష్యం. దానిని మీరు మరువకూడదు. రాత్రంతా మీరు భజన చేశారు. ఏ రాగంలో పాడినా, ఏ తాళం వేసినా మీ మనస్సు మాత్రం ఆత్మపై ఉండాలి. "సర్వ కర్మ భగవత్ప్రీత్యర్థం" అన్న భావనతో నిత్యకర్మల నాచరించాలి. "నేనెప్పుడూ భగవచ్చింతన చేస్తూ ఉంటే యుద్ధం చేసేదెట్లా?" అని అర్జునుడు ప్రశ్నించినప్పుడు కృష్ణుడు "పిచ్చివాడా! యుద్ధం చేసేది నీ దేహమేగాని, మనస్సు కాదు కదా! కాబట్టి నీ మనస్సును భగవంతునిపై పెట్టు" అన్నాడు.

**ఏది పాపం? ఏది పుణ్యం?**

నిన్న చెప్పాను – సమస్త పాపపుణ్యములకు ఇంద్రియాలే మూలకారణం. కాబట్టి ఇంద్రియాలను సద్వినియోగపరచుకోండి. మంచి మనస్సును పోషించుకోండి. మంచిగా మాట్లాడండి. చెడ్డ చూపులు చూడకండి. చెడ్డమాటలు వినకండి. ద్రౌపదిని చెడ్డదృష్టితో చూడటంవల్ల కీచకుడు భీముని చేతిలో హతమయ్యాడు. మంథర చెప్పిన చెడ్డ మాటలు వినటంచేత కైక ధర్మమూర్తియైన రాముణ్ణి అరణ్యానికి పంపించింది. అసలు కైకేయి రాముణ్ణి తన కన్న కుమారుడైన భరతునికన్న మిన్నగా ప్రేమించింది. అలాంటి పవిత్రమైన ప్రేమలో మంథర విషం కలిపింది. ఆమె చేసిన దుర్బోధలు వినటంవల్ల కైకేయి పొందిన లాభమేమిటి? ఏమీ లేదు. చెడ్డ మాటలు విన్నందుకు చెడ్డ ఫలితమే లభించింది. ఈనాడు ఎవరైనా కైక పేరుగాని, లేక మంథర పేరుగాని పెట్టుకుంటున్నారా? లేదు. చెడ్డమాటలు చెప్పినవారిని, విన్నవారిని సమాజం నిరసిస్తుంది. కనుక మీరు మంచి మాటలు వినండి, మంచి మాటలు చెప్పండి. ఒకవేళ పొరపాటున ఏవైనా చెడ్డవిషయాలు మీ చెవిలో పడితే వాటిని వెంటనే మీ మనస్సునుండి తుడిచివేసుకోవాలేగాని, మరొకరి చెవిలో వేయకూడదు. చెడ్డ విషయాలను విన్నందుకు మీరే బాధపడుతున్నప్పుడు ఆ విషయాలను చెప్పి ఇంకొకరికికూడా బాధ కల్గించటమెందుకు? చెడ్డ విషయాలను 'టాం, టాం' చేయటంవల్ల మీరు చెడిపోవటమేగాక, సమాజాన్నికూడా చెడగొట్టిన వారౌతారు. ఇంద్రియాల దుర్వినియోగమే మిమ్మల్ని పాపంలో ముంచుతుంది; ఇంద్రియాల సద్వినియోగమే మీకు పుణ్యం చేకూర్చుతుంది. "పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం." పరులను బాధ పెట్టటమే పాపం; ఆనందింపజేయటమే పుణ్యం. మీరు రాత్రంతా భజన చేశారు. భజనవల్ల అందరికీ ఆనందం కల్గుతుంది. ఇందులో

sri sathyasai vachanamrutam

పరదూషణ లేదు, పరహింస లేదు. అయితే 'పరనిందాప్రార్థన' అనేది ఒకటున్నది. ఒకసారి విదురుడు కృష్ణుణ్ణి తన ఇంటికి ఆహ్వానిస్తూ ఇట్టి ప్రార్థన చేశాడు. "మా ఇంటికి రావెందుకు కృష్ణా? నేను నీకేవిధమైన అపకారమూ చేయలేదే! కంసునివలె నిన్ను హింసించలేదే! శిశుపాలునివలె నిన్ను నిందించలేదే!" అన్నాడు.

ధర్మజుడు ఎంతో ప్రేమతో కృష్ణునికి అగ్రతాంబూలం అందిస్తుంటే శిశుపాలుడు లేచి నిండు సభలో కృష్ణుణ్ణి ఎంతగా నిందించాడు!

**"స్నానంబు చేయు ఆ జవరాండ్ర చీరలు**
**కాజేసినందుకా పూజ నీకు**
**గొల్ల పూబోండ్లతో జల్లులాడిననాడు**
**హర్షించినందుకా అర్ఘ్యమిడుట**
**చాలునిక కట్టిపెట్టు పంచాంగ మింక**
**పొగడుకొనబోకు చాలించు మూయి నోరు"**

ఈరీతిగా శిశుపాలుడు నోటికి వచ్చినట్లు మాట్లాడుతుంటే కృష్ణుడు తనకు తాంబూలం పెట్టి ఇచ్చిన పళ్ళెరమును అతనివైపు విసిరివేశాడు. చాలామంది కృష్ణుడు చక్రమును ప్రయోగించి శిశుపాలుణ్ణి సంహరించాడని అంటారు. కాని చక్రము కాదు, ఆ పళ్ళెరమే శిశుపాలుని గొంతు కోసింది. చెడ్డకాలం వస్తే కఱ్ఱయే పామై కరుస్తుంది. మంచికాలం వస్తే పాముకూడా చేతిలో కఱ్ఱగా మారిపోతుంది. మంచికాలం రావాలంటే మన హృదయంలో మంచి భావాలను ప్రతిష్ఠ చేసుకోవాలి. చెవులద్వారా మంచి విషయాలను శ్రవణం చేయాలి. నోటితో మంచి వాక్కుల నుచ్చరించాలి. చేతులతో మంచి పనులు చేయాలి. "చేతుల నిచ్చినదెందుకొ తెలుసా? నోటికి ముద్దందించుటకా? కాదు, కాదు. పతితపావనుడౌ శివుని పూజలు చేతులార చేసేటందులకు. పాదములిచ్చిన దెందుకొ తెలుసా? సందులు గొందులు తిరుగుటకా? కాదు కాదు. నందివాహనుని మందిరమ్మును చుట్టుటకు" అట్లే, చెవులనిచ్చినది భగవానుని కీర్తనలు వినేటందులకేగాని, ఊరివారి సుద్దులను వినటానికి కాదు.

sri sathyasai vachanamrutam

**ప్రొద్దుబోక ఊరివారి సుద్దులన్న**
**మీరు సిద్ధమౌదురే కడు శ్రద్ధతోడ**
**ముద్దుముద్దుగాను భగవత్ ముచ్చటలు చెప్పునపు**
**డొద్దికగ నుండరే చెవులారా!**
**పనిమాలి సినిమాలు పలుమారు**
**మీరు చనిచని కనినను తనివిలేదే**
**క్షణమును దైవసన్నిధి నిల్వగ**
**కనులారా కడు కష్టమౌగా!**

మానవుడు జగత్తునంతా కన్నులు తెరచి చూస్తాడు గాని, దైవసన్నిధికి పోతూనే కన్నులు మూసుకుంటాడు. ఏమిటీ విచిత్రం! పుణ్యపాపములకు ఇంద్రియాలే మూలకారణం. కాబట్టి, ఇంద్రియాలను పాపకార్యాలలో ప్రవేశించనీయక, పవిత్ర మార్గంలో వినియోగించినప్పుడు మీరడుగకుండానే భగవంతుడు మీకు కావలసినవి అనుగ్రహిస్తాడు.

**అడుగకువే ఓ మనసా! అడుగకువే ఓ మనసా!**
**అడుగుకొలది అది అడుగున పడునని**
**అడుగకున్న పని వడిగానగునని**
**అడుగకువే ఓ మనసా!**
**అడుగని శబరిని ఆదరించడే**
**అడుగక తనకై మడియు జటాయువు**
**కడకు నేగి సద్గతి కలిగించడే**
**అడుగకువే ఓ మనసా!**

భగవంతుణ్ణి ఏదీ అడుగనక్కర్లేదు. జటాయువు అడిగిందా? శబరి అడిగిందా? లేదు. హృదయం పవిత్రంగా ఉన్నప్పుడు అడుగకుండానే భగవంతుడు అనుగ్రహిస్తాడు. ఎంత శక్తిమంతమైన అయస్కాంతమైనా త్రుప్పు పట్టిన ఇనుమును చెంత చేర్చుకోదు. అప్పుడు ఇనుము అనుకుంటుందట, "ఈ అయస్కాంతమునకు శక్తి లేదు" అని, అప్పుడు అయస్కాంతం

srisathyasaivachanamrutam

ఏమంటుంది? "నీవేమైనా అనుకో, నాకు నష్టం లేదు. నాకు కావలసింది పరిశుద్ధత" అంటుంది. ఇనుము తన త్రుప్పును వదిలించుకొన్న తక్షణమే దానిని ఆకర్షిస్తుంది. మీ మనస్సును దుర్గుణములచేతను, దురాలోచనల చేతను, దుస్సంగముచేతను మాలిన్యం గావించుకొని "భగవంతుడా! నా మనస్సును ఆకర్షించు" అని ప్రార్థిస్తే, ఏవిధంగా ఆకర్షించగలడు? మొట్టమొదట మనస్సును పరిశుద్ధం చేసుకోవాలి. దాని నిమిత్తమై ఇంద్రియాలను పవిత్రమైన మార్గంలో ప్రవేశపెట్టాలి. మంచినే తలచాలి, మంచినే చూడాలి, మంచినే వినాలి, మంచిగా మాట్లాడాలి, మంచి పనులు చేయాలి. ఈ విధంగా మీ జీవితాన్ని గడిపినప్పుడు భగవంతుడు తప్పక మిమ్మల్ని అనుగ్రహిస్తాడు.

## దైవచింతనద్వారా ఇంద్రియదోషాల నిర్మూలన

శివరాత్రినాడు మనస్సుయొక్క 16 కళలలో పదహైదు కళలు లయమై ఒక్క కళ మాత్రమే మిగిలి ఉంటుంది. ఆ మిగిలిన ఒక్క కళకూడా లయం కావాలంటే నాలుకతో హృదయపూర్వకంగా భగవన్నామాన్ని ఉచ్చరించాలి. నాలుకకు ఎంతటి త్యాగగుణముందో తెలుసునా? ఏదైనా పదార్థాన్ని రుచి చూసినప్పుడు అది మధురంగా ఉంటే "జఠరాగ్నీ! దీనిని నీవే అనుభవించు" అని లోపలకు పంపుతుంది. ఒకవేళ అది చేదుగా ఉంటే తక్షణమే దానిని బయటికి ఉమ్మివేస్తుంది. అంతేకాదు. నాలుక ఎంతో గౌరవమర్యాదలతో ప్రవర్తిస్తుంది; ఎన్నడూ తన గడపదాటి పరులింటికి పోదు; ఎన్ని పనులైనా లోపలే చేసుకుంటుంది.

జిహ్వే రసజ్ఞే మధుర ప్రియత్వం
సత్యం హితం త్వాం పరమం వదామి
ఆవర్ణ యేథా మధురాక్షరాణి
గోవింద దామోదర మాధవేతి!

ప్రతి ఇంద్రియమూ ఒక్కొక్క పని చేస్తుందిగాని, నాలుక చేసే పనులు రెండున్నాయి. ఒకటి రుచి చూడటం; రెండవది, మాట్లాడటం. కనుక నాలుకను కొంత అదుపులో పెట్టుకోవాలి. లేకపోతే అది ఎన్నో పాపాలకు గురిచేస్తుంది. కోపం వస్తే మౌనం వహించాలి. నోరుంది

sri sathyasaivachanamrutam

కదాయని ఇష్టమొచ్చినట్లు మాట్లాడకూడదు. పరులకు ప్రీతి కలిగించే పలుకులు పలకాలి. "గోవిందా! దామోదరా! మాధవా!" అంటూ భగవన్నామాన్ని ఉచ్చరించాలి. ఊబిజిది జిలిరీరీ, ఇళిజీది ళీళిజీలి అన్నారు. తక్కువ మాట్లాడాలి. ఎక్కువ పని చేయాలి. ఎంత తక్కువగా మాట్లాడితే హృదయం అంత పవిత్రంగా రూపొందుతుంది.

ఇంద్రియ దోషాలను నిర్మూలించుకోవాలంటే భగవచ్చింతన చేయాలి. ఈనాటి మానవుడు తన ఇంద్రియాలను ఇష్టానుసారం వదలిపెట్టాడు. కనుకనే పడరాని పాట్లు పడుతున్నాడు. మొట్టమొదట తాను చేయవలసిన సాధన ఇంద్రియాలను అరికట్టుకోవటమే. ఆకలి తీర్చుకోవటానికి అన్నం తినాలి. మితిమీరి భుజించకూడదు. కడుపులో ఒక భాగమును భోజనంతో నింపండి, ఒక భాగమును నీటితో నింపండి. మిగిలిన భాగమును ఖాళీగా ఉంచండి. కాని, ఈనాటి మానవుడు గొంతువరకు తింటాడు. కూర్చున్నవాడు లేవటానికి కూడా సాధ్యం కానంతగా పొట్టను నింపుకుంటాడు. కనుకనే అజీర్ణవ్యాధికి గురి అవుతున్నాడు. తిండిని ఒక పరిమితిలో పెట్టుకోవాలి. అయితే ప్రేమను మాత్రం అదుపులో పెట్టుకోకూడదు. ప్రేమ ఇంద్రియాలతో సంబంధం లేనిది. "అందరూ నావారే, అందరియందున్నది నా ప్రాణమే" అన్న విశాలమైన భావంతో అందరినీ ప్రేమించాలి.

## ప్రభావము - స్వభావము

న్యూస్ పేపర్‌కు సహజంగా ఎట్టి వాసనా ఉండదు. కాని అందులో పకోడాలను పొట్లం కడితే అది పకోడాల వాసన పొందుతుంది; ఎండు చేపలను పొట్లం కడితే దుర్గంధాన్ని వెదజల్లుతుంది; మల్లెపూలను పొట్లం కడితే సుగంధాన్ని వెదజల్లుతుంది. అట్లే మీ హృదయంకూడా స్వచ్ఛమైన పేపర్‌వంటిది. మీరెలాంటి భావాలను మీ హృదయానికి చేరుస్తారో అలాంటి వాసనలే మీలో బయల్దేరుతాయి. కాబట్టి మంచి భావాలను చేర్చుకోండి. అప్పుడీ కలిప్రభావం మిమ్మల్ని ఏమాత్రమూ కదిలించలేదు. కలిప్రభావం ఎలాంటిదైనా మీ ఆత్మభావాన్ని నిలుపుకోవాలి. ఆత్మ భావమే మీ స్వభావం. కాని, మీరు కలిప్రభావానికి లోనై మీ స్వభావాన్ని విస్మరిస్తున్నారు. ఈనాడు మానవునియందు మానవత్వం క్షీణించి పోయింది. ధర్మాచరణ

sri sathyasai vaghamrutam

సన్నగిల్లింది. రాజకీయాలలో నీతి లోపించింది. కనుకనే భూమియందు నీరు ఇంకిపోతున్నది.

**జాతి గౌరవంబు నీతిపై నిలచును**
**నీతి లేకయున్న జాతి చెడును**
**నీతి కల్గు జాతి నిజమైన జాతిరా**
**వినుము భారతీయ వీరసుతుడ!**

విద్యార్థులారా! మీరు హిందీ భజనలు పాడేటప్పుడు 'తూ రామా, తూ కృష్ణా, తూ సాయి....' అంటూ 'తూ' అనే శబ్దాన్ని ఉపయోగపెడుతుంటారు. 'తూ' అనేది చాలా చెడ్డ శబ్దము. కావాలంటే 'తూహై' అని పాడుకోవచ్చునుగాని, 'తూ' అనే శబ్దాన్ని ఉపయోగించకండి. మాటల్లో గాని, పాటల్లోగాని మీరు ఉపయోగించే పదాలు పవిత్రమైనవిగా, గౌరవప్రదమైనవిగా ఉండాలి.

**'తన'ను 'పో'గొట్టుకున్న పోతన**

నిన్న రాజు (ఎన్.సి.సి. గ్రూపు ఛైర్మన్) పోతనపై పద్యాలు చదివాడు. పోతన ఎంతటి పవిత్రమైన హృదయం కలవాడు! అతను భాగవత రచన ప్రారంభిస్తూ ఒక చక్కని పద్యం చెప్పాడు.

**పలికెడిది భాగవతమట**
**పలికించు విభుండు రామభద్రుండట నే**
**పలికిన భవహరమగునట**
**పలికెద; వేఱొండుగాథ పలుకగ నేలా?**

'పోతన' అనే పేరులోనే ఎంతో గొప్ప అర్థం ఇమిడియున్నది. 'తన' అనే భావాన్ని 'పో'గొట్టు కున్నవాడు 'పోతన'. అందుచేతనే, అతడు గొప్ప భక్తుడైనాడు. అతడు ఆత్మతత్త్వాన్ని విశ్వసించాడు, లౌకిక తత్త్వాన్ని దూరం చేసుకున్నాడు. కనుకనే పోతన పేరు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయింది. పోతన కుమారునికి శ్రీనాథుని కుమార్తెతో వివాహం జరిగింది. పోతన కుటుంబం భూమాతను, గోమాతను నమ్ముకొని జీవనం సాగించేది.

sri sathyasai vachanamrutam

ఒకనాడు పోతన కుమారుడు భూమిని దున్నుతుంటే శ్రీనాథుడు పల్లకీలో అటువైపు వచ్చాడు. తన అల్లుణ్ణి చూసి "ఏమోయ్ హాలికా! కుశలమేనా?" అని పలుకరించాడు. అల్లుని పలకరించవలసిన తీరు అదేనా? అయినప్పటికీ అల్లునికి కోపం రాలేదు; ప్రేమతోనే జవాబిచ్చాడు. "అయ్యా! రాజుగారి సేవ చేసుకుంటూ, ఆయన పెట్టే కూడు తింటూ, పల్లకీ ఎక్కి తిరగటము కంటే భూమాతను, గోమాతను నమ్ముకొని గౌరవంగా బ్రతకటం మేలు. మేము చిన్నతనము నుండి భూమాతను ఆశ్రయించి బ్రతుకుతున్నవారము. కాబట్టి మాకెలాంటి కొరతాలేదు" అన్నాడు. ఈ రోజుల్లో అనేకమంది పల్లెప్రజలు తమ భూములను అమ్ముకొని, ధనాశతో పట్టణాలకు వలసపోతున్నారు. అందుచేతనే ఈనాడు తిండికి కరవు ఏర్పడింది. పల్లెలే భారతీయ సంస్కృతికి పుట్టినిళ్ళు. నేటికి భారతీయ సంస్కృతి పల్లెలందే గోచరిస్తున్నదిగాని, పట్టణములయందు లేదు. పట్టణములవారికి భారతీయ సంస్కృతి అంటేనే ఏమిటో తెలియదు. కాని, ఈనాడు పల్లెలవారు పట్టణాలపై మోజుతో భూమాతను విస్మరించటంచేత కష్టాలకు గురి అవుతున్నారు.

**గజేంద్ర మోక్షం**

ఒక పర్యాయం వైకుంఠంలో లక్ష్మీదేవి, విష్ణువు చదరంగం ఆడుతున్నారు. లక్ష్మి విష్ణువుయొక్క ఏనుగును కదలనివ్వకుండా కట్టివేసింది. మగవారికంటే ఆడవారికి తెలివితేటలు అధికంగా ఉంటాయి. మగవారికికూడా తెలివితేటలుంటాయి కాని, వారి మనస్సు ఎక్కడెక్కడికో పోతుంటుంది. కాని, ఆడవారు అట్లాకాదు; తాము చేసే పనిపై మనస్సును లగ్నం చేస్తారు. లక్ష్మి తన తెలివినుపయోగించి విష్ణువుయొక్క ఏనుగును కట్టివేసినప్పుడు విష్ణువు ఉన్నట్లుండి లేచి నిలబడి "గజమా! భయపడకు. నేను నిన్ను రక్షిస్తాను" అన్నాడు. తాను కట్టివేసిన గజమును రక్షిస్తానంటున్నాడేమోనని భావించి "మీ తరము కాదు" అన్నది లక్ష్మి. కాని, విష్ణువు ఆమె మాటలను వినిపించుకోకుండా లేచి వెళ్ళిపోసాగాడు. ఎందుకోసం? గజేంద్రుణ్ణి రక్షించటంకోసం.

గజేంద్రుడు అంతవరకు తన భుజబలమును, బుద్ధిబలమును చూసుకొని గర్వించినాడు. మకరితో తన సర్వశక్తులొడ్డి పోరాడి, కట్టకడపటికి అలసిపోయి "నీవే తప్ప నితఃపరం బెఱుగ

srisathyasaivachanamrutam

మన్నింపం దగున్ దీనునిన్; రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!" అంటూ ఎలుగెత్తి ప్రార్థించాడు. ఆ పిలుపు విన్న తక్షణమే విష్ణువు గజేంద్రుణ్ణి రక్షించటానికి బయల్దేరాడు. కాని, లక్ష్మికి విష్ణువు ప్రవర్తన వింతగా తోచింది. "ఏమిటి, ఇంత త్వరత్వరగా ఎక్కడికి వెళ్ళిపోతున్నాడు? ఎవరినైనా రక్షించాలనుకుంటే తన అస్త్రశస్త్రములను తీసికొని పోవాలి కదా!" అని అనుకున్నది. ఎక్కడికి పోతున్నావని అడుగుదామని వడివడిగా అడుగులు వేసింది. కాని తన మగడు చెబుతాడో, చెప్పడో అని సందేహించింది. ఈ సన్నివేశాన్ని పోతన ఈ పద్యంలో చక్కగా వర్ణించాడు :

**అడిగెదనని కడు వడి జను**
**నడిగిన దను మగుడ నుడుగడని నడ యుడుగున్**
**వెడ వెడ చిడిముడి తడబడ**
**నడుగిడు; నడుగిడదు; జడిమ నడుగిడు నెడలన్**

ఎంతటి గొప్ప పద్యము చెప్పాడు! ఎంతటి గొప్ప భావము ఇమిడ్చాడు! పోతన ఈనాటి కవులవలె కేవలం పాండిత్య ప్రదర్శనకోసం ప్రాకులాడలేదు. అతనిలో అలాంటి ఆడంబరమే ఉంటే "పలికెడిది భాగవతమట, పలికించు విభుండు రామభద్రుండట" అని ఎందుకు చెబుతాడు? పోతన మాట వేదాల మూట, తరింపగోరువారికి ఇదే రాజబాట.

(22-02-2001 ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)

sri sathyasaivachanamrutam